కథ



# మెట్టు

- సన్యాసిరావు

'చుక్కప్ప' నా బాల్య మిత్రుడు!

ఓనమాల దగ్గర్నుండి, ఇంటర్మీడియట్ వరకు ఇద్దరం కలిసే చదువుకున్నాం. ఒకే కంచం, ఒకే మంచం అనేటంత కాకపోయినా, 'వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు కదా' అని మూడో వ్యక్తి అనుకునేటంత స్నేహం మా మధ్య ఉండేది.

అయితే ఇంటర్‌దాకా కలిసి చదువుకున్న మేము అతడు ఇంజనీరింగ్ వైపు నేను బిఎస్సీ వైపు వెళ్ళటంతో విడిపోయాం. తర్వాత నేను ఎమ్మెస్సీ కంప్లీట్ చేసి పొరుగూరి కాలేజీలో లెక్చరర్‌గా సెటిల్ అయితే అతడు మాత్రం హైదరాబాద్‌లో ఇంజనీరుగా చేస్తున్నాడు. అటువంటి చుక్కప్ప నా ఊహల్లో మెదలడానికి కారణం ఈ రోజు ఉదయం జరిగిన ఒక సంఘటన!

''మిస్టర్ మూర్తీ! మిమ్మల్ని పది రోజులపాటు కంప్యూటర్ ఓరియెంటెడ్ ట్రైనింగ్‌కోసం హైదరాబాద్ పంపించాలని అనుకుంటున్నాము. మీ అభిప్రాయం ఏమిటి?'' అని ప్రిన్సిపాల్ అడిగినప్పుడు నా మనసు ఆనందంతో ఎగిరి గంతేసింది.

జాబ్ మొనాటనీ బ్రేక్ చేయడంకోసం ఎక్కడికైనా వెళదామని ఎప్పటి నుండో అనుకుంటున్నాను. కానీ పని వత్తిడి, బాధ్యతలు నన్ను కదలనీయడం లేదు. కనీసం ఈ వంకతోనైనా పది రోజులు బయట గడిపితే అంతకన్నా సంతోషం ఏమిటి? వెంటనే నా అంగీకారాన్ని ప్రిన్సిపాల్‌కి చెప్పాను. ఆయనకు 'థాంక్స్' చెప్పి గదిలో నుండి బయట పడుతుండగా 'మూర్తీ! యు హేవ్ టు మేక్ యువర్ ఓన్ ఎరేంజ్‌మెంట్స్ ఫర్ ఎకామిడేషన్' అన్న ప్రిన్సిపాల్ మాటలే నన్ను చుక్కప్ప గురించి ఆలోచించేలా చేశాయి.

నాకేమో హోటల్ తిండి పడదు. అతడెలాగూ బేచిలర్ కాబట్టి ఆ పది రోజులూ అతడి రూములోనే ఉంటే బెటర్ అన్న నిర్ణయానికొచ్చాను.

అప్పటికే సాయంకాలం కావడంతో టీ త్రాగి ''రాణీ! కాసేపలా బయట తిరిగొస్తానోయ్!'' అని భార్యామణికి చెప్పి ఇంట్లోంచి బయటపడ్డాను.

☆☆☆

పగలంతా అలసిపోయిన సూరీడు విశ్రాంతికోసం పడమటి కొండల్లోకి పరుగెడుతున్నాడు.

ఎర్రటి భాను కిరణాలు చెరువు నీటి మీదపడి విక్షేపణ చెందుతుంటే చూడ సొగసుగా ఉంది. చెరువు గట్టుమీద నడుస్తూ ఆలోచించసాగాను. నా బాల్యంలో ఈ చెరువులో ఈదులాడని రోజు లేదు. మేమంతా నీటిలో ఈదుతూ కేరింతలు కొడుతుంటే గట్టుమీద నిలబడి మా వైపు అమాయకంగా చూసేవాడు చుక్కప్ప. అతడికిలాంటి విషయాల్లో ఆసక్తి లేకపోవడం నాకు వింతగా ఉండేది.

ఇదే గట్టుమీద మేము ఎన్నో కబుర్లు చెప్పుకొనే వాళ్ళం. ఒకసారి తనకు పదో క్లాసులో స్టేట్ ర్యాంకు ఇరవై మార్కుల్లో మిస్ అయిందని, ఇంకోసారి 'ఎంసెట్' సరిగ్గా వ్రాయలేదని వెక్కి-వెక్కి- అతడేడుస్తుంటే ఇదే గట్టుమీద చీకట్లో అతడిని ఓదార్చాను. పాటల పోటీల్లో ఫస్ట్ వచ్చిందని అతడు పొంగిపోతుంటే నేనూ ఆనందించాను. అతడి బాధల్ని, ఆనందాల్ని అన్నిటినీ పంచుకున్నాను. ఎన్నెన్నో తీపి గుర్తులు! ఆ జ్ఞాపకాల సుమాలని మాలగా కడితే, ఆ పరిమళంతో నా తనువు పులకించింది. కనులు చెమర్చాయి. స్నేహం ఎంత మధురం!

'నమస్కారం మూర్తి బాబూ! ఏటి ఇటెల్తన్నారు' అని ఎవరో రైతు పలకరించడంతో ఆలోచనల్నుండి తేరుకున్నాను.

గట్టు దిగి అవతలి వైపునున్న గుడిసెలకేసి నడవసాగాను. అక్కడున్న యాభై గుడిసెల్లో ఒకే ఒక పెంకుటిల్లు! అది చుక్కప్ప తల్లి దండ్రులది. అతడు పంపించే డబ్బుతో ఈ మధ్యే కట్టుకున్నారు. దూరం నుండి చూశాను. ఇంటి ముందు నులకమంచం మీద కూర్చొని కాళ్ళు నేలకి తన్నిపెట్టి బీడీ కాలుస్తున్నాడు 'రిషాదేవుడు.' నేను అతడి దృష్టి పథంలోకి రాగానే కాలుస్తున్న బీడీ అవతల పారేసి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

''బాబూ లేవరా! రండి రండి'' అంటూ నన్ను ఆహ్వానించి, ఇల్లు రాగానే తుండుగుడ్డతో నులకమంచం మీద అటూ ఇటూ కొట్టి కూర్చోమన్నట్టు సైగచేసి ''ఏవే! మూర్తి బాబొచ్చారు. గలాసుతో మంచినీలొట్రా'' అని ఇంట్లోకి కేకేశాడు.

మంచినీళ్ళ గ్లాసుతో బయటికొస్తూ 'దండాలు బాబూ, బాగున్నారా?' అంటూ కుశలమడిగింది లచ్చుమ్మ. నా తల్లి వయసు స్త్రీ నమస్కరిస్తుంటే నాకు ఏదోలా అనిపించింది. చల్లటి నీళ్ళు గటగటా త్రాగేసి ''ఏం లేదు దేవుడూ! నేను రేపు హైద్రాబాద్ వెళ్తున్నాను. మీ చుక్కప్ప అక్కడే కదా ఉండేది. ఉన్న పది రోజులూ అతడి దగ్గరే ఉంటే మంచిది కదా అని నా అభిప్రాయం. అందుకే ఒకసారి నీతో మాట్లాడి వెళదామని వచ్చాను. నీవేమైనా చెప్పాలనుకుంటే చెప్పు'' అన్నాను.

''బాబూ! సెప్పడానికేముంది. ఇన్నాళ్ళూ నా ఇంటిదీ, నేనూ రెక్కలు ముక్కలు సేసుకుని కట్టపడ్డాం. ఆడ్ని సదివించాం. ఇప్పుడిక ఆడు ఉజ్జోగంలో సేరి నాలుగేళ్ళయింది. పెళ్ళి సేసుకోరా అంటే నా మాట ఇనడు. ఏదో సేత్తానంటాడు. ఇంకా ఏటి సెయ్యాల బాబూ? ఆడో ఇంటోడయి, మాకో మనవడ్నిత్తే ఆ సంటోడ్ని బుజాల మీదెత్తుకుని తిరగాలనుంది బాబూ...'' చెప్పుకుపోతున్నాడు దేవుడు. లచ్చుమ్మ సన్నగా ఏడుస్తోంది. నాకు మనసు బరువుగా అనిపించింది. లేచి నిలబడి వాళ్ళ దగ్గర సెలవు తీసుకొని ఇంటి ముఖం పట్టాను.

☆☆☆

హైదరాబాద్ అనబడే కాంక్రీట్ కీకారణ్యంలో అశోక్‌నగర్ అనబడే చిట్టడవిలోని ఆ ఇంటికి వెళ్ళేసరికి తాళం కప్ప వెక్కిరిస్తూ కనబడింది. చుట్టుపక్కల ఇళ్ళల్లోని రెండు మూడు మగపులులు 'ఎవరబ్బా ఈ కొత్త జంతువు' అన్నట్టు నన్నే వింతగా చూస్తున్నాయి. నాకేం చెయ్యాలో పాలుపోలేదు. సందిగ్ధావస్థలో మనసు ఊగుతుండగా అలాగే నిలబడి ఉండిపోయాను. ఇంతలో ఎదురింటి తలుపు తెరుచుకొని ఒక స్త్రీ ఏనుగు బయటకు వచ్చింది.

''ఎవరు బాబూ నువ్వు? ఎవరు కావాలి?'' అంటూ ఘీంకరించింది.

''నా పేరు మూర్తి, వెంకట కృష్ణమూర్తి, చుక్కప్ప ఫ్రెండ్‌ని. అతడికోసం మా ఊరు నుండి వచ్చాను'' బలహీనంగా చెప్పాను.

తెల్లగా, అందంగా ఉన్న నన్ను తినేసేలా చూస్తూ ''ఓహో! అలాగా. అతడు ఈ టైములో కంపెనీలో ఉంటాడు కదా! మీ దగ్గర ఫోను నంబరు ఏమైనా వుంటే ట్రై చేయండి'' అంటూ ఉచిత సలహా ఇచ్చింది.

''నా దగ్గర నంబరేమీ లేదండి'' అని ఏం మాట్లాడాలో తెలియక నా గురించి, మా ఊరి గురించి, చుక్కప్పకు నాకూ మధ్య వున్న స్నేహం గురించి, మా ఊరి చెరువు గురించి, అందులోని కప్పల గురించీ, ఈ ప్రపంచం గురించీ ఓ పావుగంట సేపు ఏకరువు పెట్టాను.

అప్పటికి సంతృప్తి చెందినట్లు మొహం పెట్టింది ఆ స్త్రీ గజం.

''అమ్మాయ్! టీవీ స్టాండు మీద తాళం చెవి వుంటుంది. ఇలా పట్రా'' అంటూ గట్టిగా అరిచింది. లోపల నుండి ఓ పిల్లగజం గున గున నడుచుకుంటూ వచ్చి తాళం చెవి నా చేతిలో పెట్టింది.

పెద్ద గజం - ''దోస్తీలు వచ్చి పోతుంటారని ఇంటి కీ మాకిచ్చి వెళతాడు నీ ఫ్రెండ్. అతడొచ్చేసరికి సాయంత్రం ఐదవుతుంది. అంత వరకూ ఇంట్లో వెయిట్ చేయండి'' అని తలుపేసుకుంది.

''హమ్మయ్య మొత్తానికి కీ దొరికింది' అని తేలిగ్గా గాలి పీల్చుకొని తాళం తీసి ఇంట్లోకి అడుగుపెట్టాను.

చాలా చిన్న ఇల్లు అది!

హాలు, బెడ్రూమ్, కిచెన్, టాయిలెట్‌తో 'ఒక' మనిషి స్వేచ్ఛగా జీవించడానికి సరిపోయేలా వుంది. హాలులో టేబుల్, కుర్చీ వేసి ఉన్నాయి. ప్రక్కనే అల్మరాలో పుస్తకాలు. వాటిని గమనించడం ప్రారంభించాను. చలం, బుచ్చిబాబు, తిలక్, గోపీచంద్, శ్రీశ్రీ లాంటి గొప్ప వాళ్ళ పుస్తకాలు. వీటితోపాటూ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్, ఇండియన్ ఎకానమీ, పొలిటికల్, కరెంట్ ఎఫైర్స్‌కు సంబంధించిన పుస్తకాలూ, బోలెడన్ని ఇంజనీరింగ్ పుస్తకాలూ, ఇండియా టుడే, ఫ్రంట్‌లైన్‌లాంటి మేగజైన్లు, హిందూ న్యూస్‌పేపర్లు అన్నీ వరుసగా పేర్చి వున్నాయి. 'ఇది ఇంజనీరు ఉండే ఇల్లా? లేక ఇంజనీరింగ్ స్టూడెంట్ ఉండే ఇల్లా?' అని ఒక్క క్షణం నాకు అనుమానం కలిగింది.

చిన్నగా నవ్వుకుని, శుభ్రంగా స్నానంచేసి ఫ్రెషప్ అయ్యాను. రిలాక్సవుదామంటే కనీసం టీవీ కూడా లేదు. ఏమీ తోచక షెల్ఫ్‌లో నుండి 'తిలక్ కథలు' తీసి చదవడంలో మునిగిపోయాను. మధురమైన కథలు అలసిన నా శరీరాన్ని ఉయ్యాలలో ఊపుతున్నాయి.

'పాపం! సుబ్బారావు' అన్న కథ చదువుతుండగా వచ్చాడు చుక్కప్ప. నన్ను చూడగానే ఆనందంతో వెర్రికేక పెట్టి గట్టిగా కౌగిలించుకొని ప్రశ్నల వర్షం కురిపించాడు. అన్నింటికీ నేను చెప్పే సమాధానాల్ని వింటూ, కంపెనీ యూనిఫామ్ విడిచి, మామూలు బట్టల్లోకి మారి, క్షణాల్లో చక్కటి 'టీ' తయారుచేసి రెండు గ్లాసుల్లో తీసుకొచ్చాడు.

నేను త్రాగడం ముగించేలోపే తను త్రాగేసి, ''మూర్తీ! నాకు ఆంత్రోపాలజీ క్లాసు వుంది. వెంటనే వెళ్ళాలి. మళ్ళీ తొమ్మిది గంటలకు వస్తాను. అంతవరకూ రూములో ఉండు. ఓకే!'' అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు. నేను విధిలేక మళ్ళీ 'తిలక్ కథలు'నే ఆశ్రయించాను.


☆☆☆



చుక్కప్ప క్లాస్ నుండి తిరిగొచ్చేసరికి తొమ్మిది దాటింది!

'మెస్'కి వెళ్దామంటూ బయలుదేరదీశాడు. హోటల్ తిండి పడదు అని నేను పైకి చెప్పలేదు. ఇద్దరం నడుస్తూ మాట్లాడుకోసాగాము. సంభాషణను సరదామయం చేద్దామని నేనే చుక్కప్పని అడిగాను.

''ఒరేయ్ చుక్కా! నువ్వు కాలేజీలో ఎవరో అమ్మాయిని ప్రేమించావట. ఎంతవరకు వచ్చింది ఆ వ్యవహారం?'' దానికి వాడు గట్టిగా నవ్వేసి చెప్పాడు.



''నేను మా మధ్య సంబంధాన్ని ప్రేమ అనుకున్నాను. తను ఫ్రెండ్‌షిప్ అనుకుంది. కంపేరబులిటీ ప్రోబ్లెం భాయ్! అయినా మనకంత 'సీన్' లేదురా! నీకు ఫిజిక్స్‌లో 'అణు నిర్మాణం' తెలుసు కదా. అందులో-తను న్యూక్లియస్ అయితే నేను వేలెన్సీ ఎలక్ట్రాన్‌ని. మా మధ్యలో ఎన్నో ఆర్బిట్స్. ఒక్కో ఆర్బిట్‌లో ఒక్కో బోయ్‌ఫ్రెండ్



ఆమెకి. ఆమె ప్రేమను పొందడం కష్టం అనిపించింది. వేలెన్నీ ఎల క్ట్రాన్‌ని కాబట్టి సులభంగా బయటపడ్డాను. అయినా ఇప్పుడవన్నీ తలచుకునేంత తీరిక కూడా లేదు. ఒకవైపు జాబ్, మరోవైపు 'సివిల్ సర్వీసెస్' ప్రిపరేషన్‌తో టైమ్ సరిపోవడం లేదు. చూస్తున్నావుగా నా లైఫ్ స్టైల్!'' అంటూ ఊపిరి తీయడంకోసం ఆగాడు.

నాక్కూడా వాడు చెప్పింది నిజమేననిపించింది. ప్రేమించబడటానికి కూడా కొన్ని అర్హతలుండాలి. ముఖ్యంగా ప్రియురాలికోసం తగినంత సమయం కేటాయించడం! చిన్నగా నిట్టూర్చి కూడా నడవసాగాను. రెండు నిముషాల్లో మెస్ వచ్చింది. మెస్ అంటే మామూలు హోటల్స్‌లో ఉండే హడావుడి అంతా ఉంటుందనుకున్నాను. కానీ నా ఇమేజినేషన్‌కి భిన్నంగా ఉంది అక్కడి వాతావరణం. ఒక చిన్న ఇంట్లో ఎవరో ఫామిలీ నడుపుతున్న హోటల్. అక్కడికొచ్చిన మిగతా వాళ్ళు కూడా పాతికేళ్ళలోపు కుర్రాళ్ళే!

చుక్కప్ప వాళ్ళందరినీ నాకు పరిచయం చేశాడు. అందరూ కత్తుల్లాంటి ఇంజనీరింగ్ స్టూడెంట్స్. విప్రో, మోటరోలా, సీమెన్స్ లాంటి కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తూ ప్రతి నెలా నా కంటే రెండు రెట్ల జీతాన్ని సంపాదిస్తున్న వాళ్ళు! కృషితో ప్రగతిని సాధిస్తూ అభివృద్ధి పథంలో పరుగెడుతున్న వాళ్ళు! ప్రపంచపు పంథాని మార్చేద్దామని తాపత్రయపడుతున్న వాళ్ళు! వాళ్ళని చూస్తుంటే ముచ్చటేసింది. పాతికేళ్ళ కుర్రాళ్ళందరూ బేవార్స్, గాళ్ళని, అమ్మాయిలను వాడుకొని వదిలేయడానికే పుట్టారని బలంగా నమ్మే స్త్రీ వాదులు ఇక్కడి వాతావరణం చూస్తే తమ సిద్ధాంతం తప్పేమో అని క్షణకాలం డైలమాలో పడతారు. నవ్వుతూ, తుళ్ళుతూ వాళ్ళు మాట్లాడే ప్రతిమాట వారి తెలివి తేటల్ని చూపిస్తున్నాయి. కెరీర్ పట్ల, జీవితం పట్ల వారి అవగాహనను చెబుతున్నాయి ... అందరం భోజనానికి కూర్చున్నాం!

ఎవరో అడిగారు చుక్కప్పని ''ఏరా చుక్కా! హౌ ఈజ్ యువర్ సివిల్స్ ప్రిపరేషన్?''

''ఫర్వాలేదురా, నడుస్తుంది'' మా వాడి సమాధానం.

''నడుస్తుంది అంటే కుదరదు భాయ్! పరుగెత్తాలి, నీకు తెలియనిదేముంది. కమింగ్ టూ ఇయర్స్‌లో పోస్టులు బాగా తగ్గిపోతున్నాయి కదా! ప్రిపరేషన్ గట్టిగా ఉండాలి. అందులోనూ రెండు మూడేళ్ళుగా ప్రిపేరవుతూ వ్రాసేవాళ్ళు వుంటారు. వారితో పోటీ మరీ కష్టం'' ఎవరో సలహా ఇచ్చారు.

అన్నింటినీ శ్రద్ధగా వింటున్నాడు చుక్కప్ప.

విజయానికి మొదటిమెట్టు ఎదుటివాడు చెప్పే 'మంచి'ని వినడమే కదా అని మనసులో నేననుకున్నాను.

☆ ☆ ☆

భోజనం ముగించి రూముకి వచ్చేసరికి ఇద్దరు కుర్రాళ్ళు చుక్కప్ప కోసం వెయిట్ చేస్తున్నారు. వాళ్ళ చేతిలో బుక్స్ బట్టి తెల్సింది, ఇంజనీరింగ్ చదివే విద్యార్థులని. తమ సందేహాలని నివృత్తి చేసుకోవడం కోసం వచ్చారట. అప్పటికే బాగా డస్సిపోయి ఉండటంతో నేను బెడ్‌మీద వాలిపోయాను. చుక్కప్ప వాళ్ళకి ఎక్స్‌ప్లెయిన్ చేస్తున్నాడు. క్రమంగా నిద్రాదేవి నన్ను తన ఒడిలోకి లాక్కుంటోంది. 'హైఫ్రీక్వెన్సీ, మాడ్యులేషన్, కేరియర్ కమ్యూనికేషన్' లాంటి పదాలు నాకు లీలగా వినిపిస్తున్నాయి.

'' ... ఇసుక, ఎటు చూసినా ఇసుక, అనంత దూరం వరకు వ్యాపించి ఉంది. అంత పెద్ద ఎడారిలో నేనూ, చుక్కప్ప తప్ప ఎవ్వరూ లేరు. దూరంగా కనిపిస్తున్న ఎత్తైన ఇసుక మేటను ఎక్కడం కోసం ఇద్దరం పరుగందుకున్నాం. ముందుగా చేరుకొని ఆ ఇసుక మేటను ఎక్కేశాడు చుక్కప్ప. పైనుండి నన్ను పిలుస్తున్నాడు. నేను సగం వరకు ఎక్కాను. తర్వాత కష్టమవుతోంది. అయ్యో! ... జారిపోతున్నాను. క్రింద పెద్ద లోయ! ... జారిపోతున్నాను ... జా ... రి ... పో ... తు ... న్నా ... ను.''

సడన్‌గా మెలుకవొచ్చింది. పీడకల!

దాహం అనిపించి కిచెన్‌లోకి వెళ్ళి మంచినీళ్ళు త్రాగాను. ముఖానికి పట్టిన చెమటను చేత్తో తుడుచుకుంటూ హాల్లోకి వచ్చిన నేను, అక్కడి దృశ్యాన్ని చూసి ఉద్విగ్నతకు లోనయ్యాను. చుక్కప్పమీద విపరీతమైన ప్రేమ కలిగింది! కుర్చీలో కూర్చొని, టేబుల్‌మీద తలానించి గాఢ నిద్రలో ఉన్నాడు చుక్కప్ప. టైమ్ ఒంటిగంట దాటింది. టేబుల్ లేంప్ వెలుగుతోంది. పైన సీలింగ్ ఫేన్ స్పీడుగా తిరుగుతుంది. ఫేన్ గాలికి అతడు వ్రాసుకునే కాగితాలు క్రింద పడి ఎగురుతున్నాయి. తీసి వాటిని సర్దుతూ చదివాను.

'ఇండియన్ సొసైటీ ఎట్ క్రాస్‌రోడ్స్' అన్న ప్రశ్నకు 4 పేజీల సమాధానం వ్రాసి, అది నచ్చక దాన్ని కొట్టేసి మళ్ళీ వ్రాసుకున్నాడు.

'సివిల్స్'లో విజయానికి 'డిస్క్రిప్టివ్ స్కిల్స్' అవసరం అని నాకు తెలుసు. అందుకే అతడు రైటింగ్ ప్రాక్టీసు చేస్తున్నాడని అర్థమయింది. నిద్రలో ఉన్న అతడిని గమనించసాగాను. మనసంతా ఏదో కొత్త ఫీలింగ్! బాగా అల్లరిచేసి, తల్లి చేత దెబ్బలు తిని ఏడ్చి, అలసిపోయి నిద్దరోతున్న కొడుకు మీద ఆ తల్లికి కలిగే ఫీలింగ్ లాంటిది! 'స్నేహం' అన్న భావం గొప్పది కావచ్చు, 'ఆరాధన' అన్న భావం అంతకన్నా గొప్పది!

☆ ☆ ☆

పది రోజుల ట్రైనింగ్ ముగించుకుని, రైలు దిగి ఊళ్ళోకి వస్తుంటే కన్నతల్లి ఒడిలోకి చేరుకున్న పసిపిల్లాడిలా అనిపించింది.

నడుస్తుంటే ఎదురొచ్చారు - పొట్టి కేశవ, సూర్నాయుడు!

సూర్నాయుడు చిన్న సైజు రింగు లీడరు. ప్రాంతీయ మేధావి! అతడి పొట్ట పెద్దది. గొంతు చిన్నది. వాడి భజనపరుడు పొట్టి కేశవ. బిల్‌క్లింటన్ నుండి బిల్లు కలెక్టర్ వరకు అందరినీ వీళ్ళు విమర్శిస్తుంటారు. తప్పించుకుందామంటే కుదరలేదు. సూర్నాయుడు అడగనే అడిగాడు.

''ఏటండోయ్ మూర్తి గారూ! హైద్రాబాద్ ఎల్లారట? మన 'సుక్కడు' ఎలాగున్నాడు?''

''అతడికేం బాగానే ఉన్నాడు. మిమ్మల్నందరినీ అడిగినట్లు చెప్పమన్నాడు.''

''అహ్హహ్హ ...'' అని వికృతంగా నవ్వి ''... బలేగ సెప్పారండీ. ఆడు బాగోక మనం బాగుంటావా? ఆడు 'గవర్మెంటోళ్ళ' ముద్దు బిడ్డ.

ఆడు అలాగే పైకెల్తాడు. మనం ఇలాగే ఇక్కడుంటాం. ఏరా! అంతేనా?'' అంటూ ప్రక్కనున్న పొట్టికేశవ డొక్కలో మోచేత్తో పొడిచాడు.

దానికి వాడు కిసకిసమని నవ్వి 'అంతేనండీ' అన్నాడు.

సమాజంలో వెనుకబడిన వారిని పైకి తీసుకు రావడానికి గవర్నమెంటు వేసిన 'రిజర్వేషన్ మెట్లు' చుక్కప్ప ఎక్కడం లేదనీ, నిరంతర కృషితో అతడు ఎక్కుతున్నది 'చదువు మెట్లు' ని నాకు తెలుసు కాబట్టి మౌనంగా సాగిపోయాను.

వాళ్ళింకా నవ్వుతూనే ఉన్నారు - లోకంలోని ఎంతో మంది సగటు మేధావులకి ప్రతినిధుల్లాగ!